

# ఆమెకు నచ్చిన కథ

- సలీం

హర్షకు ఈ కథ కూడా నచ్చలేదు.

"ఎందుకు నచ్చలేదు" అని అడిగాను.

"అలా చెప్పటం కష్టం. మీ కథ ఈ వారపత్రికలో వచ్చిందంటే ఆ సంపాదక వర్గానికి నచ్చిందనేగా అర్థం... అలా కొంత మందికి నచ్చిన విషయం అందరికీ నచ్చాలని లేదు కదా. అందుకని.." తన చేతిలోని వార పత్రికని తిరిగి ఇచ్చేస్తూ అంది.

కొంత నిరుత్సాహపడిన మాట మాత్రం నిజం.

హర్షకు నచ్చేట్లు కథ రాయాలనో - నేను రాసిన కథ హర్షకు నచ్చాలనో నేనెపుడూ అనుకోలేదు. అయినా హర్ష పరిచయమైనప్పటినుండీ నాకథలు హర్ష చదవటమూ, చదివాక పెదవి విరిచేయటమూ జరుగుతూనే ఉంది. అలా జరిగిన ప్రతిసారీ నేను రాయబోయే తదుపరి కథ ఈ అమ్మాయికి తప్పకుండా నచ్చుతుందని ఆశపడటమూ... తీరా ఆకథ వచ్చాక ఇలా నిరుత్సాహ పడటమూ అలవాటైంది.

ఐదేళ్ళ క్రితం హర్ష మా ఆఫీస్‌లో స్టైనోగా చేరింది. మరీ అంత అందం కాకున్నా చూడగానే "చక్కగానే ఉంది" అని అనుకునేంత అందం. కొద్దిగా చామనచాయ.. ఎటొచ్చీ ఆ కళ్ళే - కలలు కంటున్నట్లు - ఎక్కడో విహరిస్తున్నట్లు ఉంటాయి. హర్ష చాలా తెలివి గలపిల్ల. చాకులాంటి పదునుంది ఆమెలో..

మా ఆఫీస్‌లో అంతా కలిపి పది మందికి మించి ఉండరు. నేనూ, హర్షా తప్ప, మిగతా అందరూ నలభయ్యో పడిలో ఉన్నవాళ్ళే. ఇద్దరం అవివాహితులం కావటం వలనా - పాతిక లోపే వయసులో ఉండటం వలన అనుకుంటాను, సన్నిహితులమైనాం.

మొదటి రెండు సంవత్సరాలూ హర్షకు నేను కథలు రాస్తానన్న విషయం తెలియదు. నేను రచయితనన్న విషయం పదిమందికీ చెప్పుకోవటం, ప్రచారం నాకిష్టముండదు.

ఓరోజు ఆఫీస్ నించి అయిదింటికి బైటికొచ్చాను. నా వెనకే హర్షకూడా వచ్చింది.

ఇద్దరం బస్టాపు వైపు నడిచాం. ఇద్దరిదీ ఒకరూటు బస్సే . నేను మలక్‌పేటలో దిగిపోతాను - హర్ష వనస్థలి పురం వరకూ వెళ్తుంది.

"ఈ రోజెందుకో డల్‌గా ఉన్నారు " అన్నాను.

హర్ష పేలవంగా నవ్వింది - జవాబివ్వకుండా.

అసహనంగా రోడ్డు వైపుకు దృష్టి సారించాను. బస్సు జాడ కన్పించడం లేదు.

హర్షవైపు చూశాను. తనూ అసహనంగానే ఉన్నట్లుంది.

"అదుగోండి మనబస్ వచ్చేస్తోంది." అన్నాను ఉత్సాహంగా.

చాలా నిరాసక్తంగా చూసింది హర్ష.

"మీరు వెళ్ళండి. నేనలా ట్యాంక్‌బండ్ వరకూ నడుద్దామనుకుంటున్నాను " అంది.

నాకెందుకో హర్ష దేనిగురించో బాధ పడ్తుందని అన్పించింది.

"సరే పదండి... నేనూ వస్తాను" అన్నాను.

మా ఆఫీస్ నించి ట్యాంక్ బండ్ చలా దగ్గిరే. దారిలో ఇద్దరమూ మాట్లాడుకోలేదు. తల వొంచుకుని మౌనంగా హర్ష, నా ఆలోచనల్లో మునిగి నేనూ - నడిచాం.


సిమెంట్ బెంచీమద కూర్చున్నాక అడిగాను. ఎందుకలా ఉన్నారని.

హర్ష హుస్సేన్ సాగర్ నీళ్లలోకి చూస్తోంది. సూర్యుడు పడమటికి వాలిపోతున్నాడు. ఆకాశం నిండా అరుణిమ పులుముకుని ఉంది.

"మనసేం బాగోలేదండి" అంది హర్ష.

"అది తెలుస్తూనే ఉంది కదా - కారణం చెప్పండి. నేనేమైనా చేయగలిగితే నాకు చాతనైన సాయం చేస్తాను."

"కష్టాలు చెప్పుకునేది ఎవరో సాయం చేయాలని కాదు. మనసులోని బరువు తగ్గుతుందని- అయినా కొన్ని రకాల కష్టాల విషయంలో ఎవ్వరూ ఏమీ చేయలేరు."



నేను పొరపాటుగా మాట్లాడానని అర్థమైంది. నిశ్శబ్దంగా కూచున్నాను.

"మన ఆఫీస్‌లో మీరొకరే నాకు ఆప్తుడిలా ఆత్మీయుల్లా కన్పిస్తారు. అందుకే మీకు చెప్పాలనిపిస్తుంది... మా నాన్నగారి అకాల మరణం చూశారా మా జీవితాల్ని ఎలా ఛిన్నా భిన్నం చేసిందో"..

నేను హర్షవైపు చూడకుండా శ్రద్ధగా వింటున్నాను.

"అమ్మకు అనారోగ్యం. చెల్లెలి చదువింకా పూర్తికాలేదు. తమ్ముడింకా పసివాడే.. చూశారా - ట్రాజెడీ కథల్లోని అన్ని కష్టాలూ నా జీవితంలో ఉన్నాయి".

హర్షకళ్ళల్లో నీళ్ళు..

"వాటికెపుడో మీరు అలవాటు పడి ఉండాలి హర్షా - ఇప్పుడు కొత్తగా ఉదాసీనం కావడానికేముంది?"

"నిన్ననే తెల్సిందండీ అమ్మకు టి.బి. అనీ.."

హర్ష కొద్దిగా వెక్కుతోంది.

"దానికే అంతబాధ పడాలా - అదేమీ భయంకరమైన వ్యాధి కాదు - దానికిపుడు చాలా మంచి మందులున్నాయి." అన్నాను ధైర్యం చెప్తూ.

"నాబాధ అదికాదండీ.. నా జీతం ఇంటి అవసరాలకూ, చెల్లెలి తమ్ముడి చదువుకూ సరిపోవటమే అంతంత మాత్రం - ఇపుడీ వ్యాధి అంటే బలమైన ఆహారం పెట్టాలి.. ఖరీదైన మందులు కొనివ్వాలి..." ఆగిపోయింది హర్ష.

ఆమెను కలవరపెడుతున్న దేమిటో నాకు అర్థమైంది.

అప్పటినుండీ హర్షా, నేనూ మరీ సన్నిహితులమైనాం. ప్రత్యక్షంగా సహాయం చేస్తే హర్ష గాయపడుతుందని తెలిసి, పరోక్షంగా సహాయపడేవాడిని.

ఆదివారాలు హర్ష నా గదికి వచ్చేది. అలా రావటం ప్రారంభించాకే తెల్సింది నేను కథలు రాస్తానని.

"మరి ఇన్నాళ్ళూ చెప్పనేలేదేం. నా దగ్గర కూడా దాచే రహస్యాలున్నాయన్నమాట." అంది ఉక్రోషంగా.

"నా దగ్గిరకూడా" అనటంలో ఉద్దేశం అర్థమై - నేను మనసులోనే నవ్వు కున్నాను.

అప్పటి నుండీ నేను రాసే ప్రతికథా చదివి - "ప్చ్ బాగా లేదు" అనటం పరిపాటి



అయిపోయింది.

"అయినా ఎప్పుడూ పేదవాళ్ళు - కూలివాళ్లు - దీనులు-హీనులు అంటూ రాస్తారేమిటి ? సామాజిక స్పృహ అంటే అదేనా అర్థం? సమాజం అంటే అట్టడుగు మనుషులేనా.. మన మధ్య తరగతి జీవితాటల్లో ఎన్నెన్ని కథల్లేవు? ఎన్నెన్ని సంక్లిష్టతలూ.. సమస్యలూ లేవు? అయినా మీ రెపుడూ వాటి జోలికి వెళ్ళరు."

"జీవితంలో ప్రధానమైన సమస్య ఒక్కటే - ఆకలి. మీరు చెప్పే మధ్య తరగతి సమస్యలు సగం మానసికమైనవి. మరో సగం వాళ్ళకు వాళ్ళు సృష్టించుకునేవి."

"మనసికమైన సమస్యలు సమస్యలు కావా.. అది జీవితం కాదా - ఆ సంఘర్షణ రాయడానికి అర్హమైనది కాదా?"

"మొన్నటి వరకూ - ఈ చిన్న ఉద్యోగం దొరికే క్షణం వరకూ నేను ఆకలితో పోరాడుతూనే ఉన్నాను. అన్నింటికంటే బలమైన నిజమైన సమస్య ఒక్కటే - ఆకలి. ఈ ప్రేమలూ - విడిపోవటాలూ విరహాలు - మనస్తాపాలు - అనుబంధాలు -- కృత్రిమమైన జీవన విధానంలోని రంగులూ - హంగులూ... నాకు నచ్చవు. ఇవన్నీ మనకు మనం కల్పించుకుని, మన అహాన్ని తృప్తి పరచ్చుకోడానికి ఆడుకునే నాటకాలే."

హర్ష ఒప్పుకోలేదు. నేను ఒప్పించటానికి ప్రత్యేక ప్రయత్నాలేవీ చేయలేదు.

నేను వ్రాసిన ఓ కథకి ఉగాది కథల పోటీలో బహుమతి వచ్చింది. ఆ కథ హర్షకు తప్పకుండా నచ్చుతుందనుకున్నాను.



అందులో ఓ వేశ్యతో ఒకతనికి స్నేహం ఏర్పడుతుంది. ఆమెతో తనకు పరిచయమైన మిగతా స్త్రీలలో లేని నిజాయితీ అతన్ని ఆకర్షిస్తుంది. చివరికామెను పెళ్ళి చేసుకుంటాడు అదీకథ.

"ఇంతేనా .. ఇందులో హృదయాన్ని స్పందింపచేసే విషయం ఏముంది" అని తేల్చేసింది హర్ష.

"అవును. మీ ఆకలి కేకలు లేవేం" అని ఎగతాళి చేసింది.

"మంచి భర్త - చక్కని పిల్లలూ- అని కలలుగనే ఆడపిల్లలు వేశ్యలుగా మారేది ఆకలిని చల్లార్చుకోడానికే" అన్నాను.

కళ్ళు కలల్లో ఆరబోసుకుంటున్నట్లు విప్పార్చి చూసింది.

"ఏమో - నాకు నచ్చలేదు బాబూ మీ కథ" అంది పెదవి విరుస్తూ.

ఓ ఆదివారం హర్షనా గదిలో కూచుని ఉంది.

"ఏమిటీ విశేషాలు ?" అని అడిగాను.

"ఏం చెప్పాలన్నా భయమే. మీ రచయితల్తో ఇబ్బందేనండి. ఎక్కడో ఏదో కథలో ఇరికించేస్తారు. అయినా ఎవరి మాటల్లో, ఏయే సంఘటనల్లో కథకు ప్లాట్లు దొరకుతాయా అని ఆవురావురు మంటూ ఎదురు చూస్తుంటారు" అంది.

నేనెపుడూ ప్లాట్ల కోసం వెతుక్కున్నట్లు గుర్తు లేదు. కథ రాయటం కోసం వెతికి - వేటాడి ఒడిసి పట్టుకుని - అక్షరాల్లో బంధించి .. ఎంతటి అసహజత్వం! అందుకే నేను ఆరేళ్ళ రచనా జీవితంలో డజను కథల్ని మించి రాయలేక పోయానేమో. ఎపుడో ఏ భావమో హృదయాన్ని తాకినపుడో.. ఏ అనుభూతో గుండెల్ని కదిలించినపుడో.. ఏ వూహో మననుని మెలిపెట్టినపుడో.. దాన్ని సంఘటనలుగా పేర్చి పదిమందితో పంచుకోవాలన్న తపనతో రాస్తానే తప్ప .. ప్చ్.. హర్షకు చెప్పినా అర్థం చేసేకోలేదని తెల్సింది కాబట్టి మౌనంగా ఉండిపోయాను.


"ఈ మధ్య ఏమీ వ్రాయలేదా" అని అడిగింది కుతూహలంగా.

రాసేసిన కథల్ని - ప్రింటయిన కథల్ని చదివి అంత నిరాశను - అనిష్టాన్ని ప్రకటించే హర్ష - కొత్తగారాసిన కథల గురించి అంత ఉత్సాహంగా అడగటం నాకెపుడూ పజిలే.

ఓ వార పత్రిక్కి పంపిద్దామని సాపు చేసి ఉంచిన కథని ఇచ్చాను చదవమని.

చాలా దీక్షగా చదివింది హర్ష. అందులో ఓ పాలేరు జీవితం -అతని అమాయకత - భూస్వామి దౌర్జన్యం - దోపిడీ.. గురించి రాశాను.

హర్షకు ఎలాగూ నచ్చదని తెలుసు కాబట్టి ఆమె అభిప్రాయం కోసం ఎదురు



చూడటం మానుకున్నానీ మధ్య.

నేనూహించినట్లు హర్షకూడా ఆ కథ గురించి ఏమీ చర్చించలేదు. వాళ్ళమ్మ ఆరోగ్యం, చెల్లెలి ఫైనలియర్ పరీక్షలు - తనకష్టాలూ- కన్నీళ్ళు చెప్పుకుంది.

"అమ్మ పెళ్ళి ప్రస్తావన తీసుకొస్తుంది. మీరే చెప్పండి. పెళ్ళి చేసుకుంటే అమ్మ, చెల్లి తమ్ముడూ ఏమైపోతారు ? అయినా నా పరిస్థితుల్ని సహృదయంతో అర్థం చేసుకునే మగవాడు దొరకద్దూ" అంది - కలల చుట్టూతా తిప్పుతున్నట్లు కళ్ళు చక్రాల్లాతిప్పి.

నేనుకూడా హర్షతో ఏకీభవించాను. కొన్నాళ్ళు పెళ్ళి చేసుకోక పోవటమే ఉత్తమం అనిచెప్పాను.

"వయసు మనకోసం ఆగుతుందా" అంది దిగులుగా.

"పోనివ్వండి - ఆగినా ఒరిగేదేమిటి. అర్థం లేని సుఖం" అన్నాను.

"మీరు మహర్షిలానో - మరబొమ్మలానో పోజుపెట్టి మాట్లాడ్తారేమిటి? ఏ వయసులో జరగాల్సిన ముచ్చట ఆవయసులో జరిగితే బావుంటుంది". కస్సుమంది.

క్షణం క్రితం "పెళ్లి చేసుకుంటే ఎలా చెప్పండి" అని, ఇవుడు "పెళ్ళయితే బావుంటుంది" అనటంలో ఆంతర్యం నాకు అర్థం కాలేదు.

"అటువంటప్పుడు అంత ఆలోచన దేనికి - మీ పరిస్థితుల్ని వివరించి - అన్నిటికీ ఒప్పుకునే వ్యక్తినే పెళ్ళి చేసుకోండి" అన్నాను.

దీర్ఘంగా నావైపోసారి చూసి - మరో మాట మాట్లాడకుండా వెళ్ళి పోయింది.

ఈ సంఘటన జరిగాక హర్షకు కథల గురించి చర్చించటం,కథల ప్రతుల్ని చూపించటం మానుకున్నాను.

పత్రికల్లో మరో రెండు కథలు అచ్చయ్యాయి.

హర్ష ఆరోజు ఆఫీస్‌కు రావటమే చాలా ఉత్సాహంగా వచ్చింది - గాల్లో తేలిపోతున్నట్లు.

"సాయంత్రం ట్యాంక్‌బండ్‌కి వెళ్దాం. మీతో చాలా విషయాలు మాట్లాడాలి" అంది.

రోజూ ఆఫీస్‌లో - సాయంత్రాలు బస్టాపులో - ఆదివారాలు మా గదిలో మాట్లాడుకునే మాటలు కాక ఈ రోజు సాయంత్రం ట్యాంక్‌బండ్ మీద ప్రత్యేకంగా మాట్లాడాల్సిన విషయాలేమిటో అంతుబట్టలేదు.

"మీరు రాసిన ఫలించిన కల" అనే కథ చదివాను నిన్న అంది ఉపోద్ఘాతంగా - ట్యాంక్‌బండ్‌మీద.

"మీరు నాకు చెప్పనేలేదేం. అనుకోకుండా చూడటం జరిగింది.. అమ్మో - అది మిస్ అయి ఉంటే.." ఆగి నావైపు చూసింది.

"ఎంత బాగా రాశారో - అద్భుతంగా ఉంది కథ" కళ్ళు అరమోడ్పులు చేసింది.

షాక్ తిన్నాను. ఆకథలో అంత అద్భుతమైన విషయం ఏమీ లేదు. చాలా మామూలు కథ.

"అందులో నీరజని ఎంత చక్కగా వర్ణించారో.."

ఓ క్షణం ఏ రాశానా అని గుర్తుకు తెచ్చుకున్నాను.

"నీరజది పర్వా లేదనిపించే అందం - చామనచాయ - ఎటొచ్చీ ఆకళ్ళే - కలలు కంటున్నట్లు" అని రాశాను.

"నిజం చెప్పండి.ఆ కథ నన్ను దృష్టిలో పెట్టుకునే కదూ రాశారు ?" అంది కళ్ళు స్వాప్నిలం అవుతుండగా.

ఆ కథలో ఓ నిరుద్యోగి ఉంటాడు. అతను రచయిత. అతనికి నీరజతో పరిచయం అవుతుంది. నీరజ కూలి పని చేసుకునే పిల్ల ఆమెకు టి.బి.తో బాధపడే తల్లి. ఓ చెల్లెలూ తమ్ముడూ ఉంటారు. నీరజ బాధ్యతల్ని తను స్వీకరించటానికి ఇష్టపడి - ఆమెను పెళ్ళి చేసుకుంటాడు. అతనూ కూలి పనికి సిద్ధ పడతాడు.

హర్షకు ఇన్నాళ్ళూ నాకథలు ఎందుకు నచ్చలేదో అర్థమై నేను ఆశ్చర్యపోయి చూస్తున్నాను.

కలల్లో తేలిపోయే కళ్ళతో నా వైపు చూసింది హర్ష "నాకు తెలుసు - ఆ కథలో నీరజని నేనే" అంది మత్తుగా కళ్ళు మూస్తూ.



## విజయనిర్మల హాబీలు

విజయనిర్మల మొదట్లో నటి, ఆ తర్వాత గృహిణి, ఆ తర్వాత దర్శకురాలు. మూడు బాధ్యతల్ని నిర్వహించగల శక్తి, యుక్తి సామర్థ్యమూ ఉన్నాయి విజయనిర్మలలో.

నటిగా కన్నా దర్శకురాలుగా ఒక సమగ్రత్వం ఉంటుందని విజయనిర్మల అభిప్రాయం. మూడు బాధ్యతల మహిళగా ఆమెకు ఇంకా హాబీలు కూడా ఉన్నాయంటే, వాటికీ సమయం ఉందంటే నమ్మాలి.

విజయనిర్మల కిప్పుడు సమాజ సేవ మీద దృష్టి మళ్ళింది. ఆమె ఎఫ్.డి.సి. మెంబర్, లయన్స్ క్లబ్ మెంబర్. హెూటల్ మేనేజిమెంటు ఆమె కిష్టం. మద్రాసులో ఆమె కుటుంబం అంతా కలిసి ఓ హెూటల్ నిర్వహిస్తున్నారు. ఇంటీరియర్ అలంకరణలో ఆమె దిట్ట. తన భవనాన్ని షూటింగులకు అనువుగా తీర్చిదిద్ది అలంకరిస్తుంది. తోట పని అంటేనూ శ్రద్ధ తీసుకుంటుంది.

గృహిణిగా ఏ మాత్రం లోటు చెయ్యదు. ఇంట్లో వంట తానే చేస్తుంది. చవులూరించేట్లు వంటచేసి కృష్ణకూ, పిల్లలకూ తినిపించడం అన్నిటికన్న ముఖ్యమైన కర్తవ్యంగా విజయనిర్మల భావిస్తుంది. ఆమె ప్రేమికురాలు. ఆమెకున్న కృష్ణ ప్రేమ ఎలాంటిదంటే మరో జన్మలో కూడా కృష్ణనే ప్రేమించి పెళ్లాడాలని అనుకుంటున్నట్లు చెప్తుంది.

విజయనిర్మల హాబీల్లో కృష్ణప్రేమకు అగ్రస్థానమన్నమాట.

తారకం